ఘనంగా స్నేహితుల దినోత్సవం

విశాలాంధ్ర - గంగవరం : మండలంలోని పలు ఆదివారం రాత్రి స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గంగవరం, జగ్గంపాలెం,జియ్యం పాలెం, రాజవరం గ్రామాల్లోని స్నేహితులంతా కలిసి స్నేహితులు ఒకచోట చేరి స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పండ సిద్ధార్థ దొర. (అడ్వకేట్) పాల్గొని కేక్ కట్ చేసి అందరికి ముందుగా స్నేహితులు దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. స్నేహం యొక్క విలువ మరియు ఎటువంటి కుల, మత, వర్గ, ప్రాంత, లింగ బేదాలు లేకుండా అందరినీ కలిపేది స్నేహం ఒక్కటే అని తెలిపారు. ఈ

కార్యక్రమంలో కుంజం శ్రీను, చెడం దివాకర్, దినేష్, రవి, మహేష్, బాబు, మల్లేష్ పంచాయతీ ల యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముర్రుపాలు శిశువులకు మొదటి టీకా : స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి

విశాలాంధ్ర - చింతపల్లి : తల్లి ముర్రుపాలే " శిశువులకు మొదటి టీకా అని, ఆ పాల ద్వారానే శిశువులకు జీవితకాల వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని, అందుకే ప్రతి గర్భిణీ ప్రసవానంతరం మొట్టమొదటగా స్రవించే లేత పసుపు వర్ణంలో ఉండే ముర్రుపాలను శిశువులకు విధిగా త్రాగించాలని. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ సూర్యలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం స్థానిక స్త్రీ శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) ప్రాజెక్టు అధికారిని జీవి రమణి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సూర్యలక్ష్మి ముందుగా తల్లిపాల విశిష్టత, బాల్య వివాహాల వలన కలుగు అనర్ధాలపై వివరించారు. తల్లి ముర్రుపాలు త్రాగడం వలన శిశువులు వ్యాధుల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. ప్రతి బాలింత శిశువులకు ఆరు నెలల పాటు విధిగా తన పాలు పట్టాలన్నారు. ఆరు మాసాల తరువాత నుంచి తల్లి పాలతో పాటు శిశువులకు అదనపు ఆహారాన్ని అలవాటు చేయాలన్నారు. అదే క్రమంలో బిడ్డకు రెండేళ్ల వచ్చే వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఏ టి డబ్ల్యు ఓ జయ నాగలక్ష్మి, సిడిపిఓ రమణి తల్లిపాల వారోత్సవాల పై ప్రసంగించారు, అనంతరం మండల రెవెన అధికారి రామకృష్ణ మాట్లాడుతూ తల్లి ముర్రుపాలు శిశువులకు జీవిత కాల వ్యాధి నిరోధక టీకా అన్నారు. పూర్తిస్థాయిలో తల్లిపాలను త్రాగని వ్యక్తులు మూర?త్వంతో వ్యవహరించే క్రూరత్వం కలిగిన వ్యక్తులుగా తయారయ్యే ప్రమాదం లేకపోలేదన్నారు. అనంతరం తహసిల్దార్ రామ కృష్ణ, ఏటిడబ్ల్యూఓ జయనాగలక్ష్మి లతో కలసి ఆమె చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 25 మంది గర్భిణీ లకు సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకట రమణ, ఈఓపిఆర్డి శ్రీనివాసరావు, ఏసిడిపిఓ రామలక్ష్మి, సూపర్వైజర్లు షేక్ గౌహ రన్నీషా, విజయ్ కుమారి, సత్యవతి, అప్పలనరస, గౌరీ, వైద్య సిబ్బంది, అధిక సంఖ్యలో అంగ న్వాడి కార్యకర్తలు, ఆయాలు, గర్భిణీలు పాల్గొన్నారు.

వరినాట్లు వేసిన ఎమ్మెల్యే శిరీష

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : రంప చోడవరం ఎమ్మెల్యే మిరియాల షిరిషాదేవి సోమవారం రాజవొమ్మంగి వస్తు తన సొంత గ్రామమైన గింజర్తి దగ్గరలో తమ బంధువులు వరినాట్లు వేస్తూ కనిపించడంతో ఎమ్మెల్యే తన కాన్వాయ్ ని అపి వారందరిని పలకరించి వారితోపాటు కొంచెంసేపు వరినాట్లు వేశారు, చదువు పూర్తి అయిన తరువాత తల్లితండ్రులకు సహాయం చేసేందుకు వ్యవసాయ పనులకు వెళ్లే వాళ్ళమని తెలిపారు,ఆమె వరి నాట్లు వేయడంతో బందువులందరు ఎంతో సంతోషించారు,

నవజాత శిశువుకి తల్లిపాలే అమృతం

విశాలాంధ్ర - జీకే వీధి : గూడెం కొత్త వీధి పరిధిలో ఒబాపాలం అంగన్వాడీ కేంద్రం పరిధిలో ప్రపంచ తల్లి పాలు వారోత్సవాలు ఐసిడి ఎస్ సిడిపిఓ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర పరిధిలోని గర్భవతులు, బాలింతలు పలువురు హాజరయ్యారు. సీడీపీఓ ఈ సందర్భంగా మాట్లాడుతూ నవజాత శిశువుకి తల్లి పాలు అమృతం అని, పుట్టిన గంట లోపు ముర్రుపాలు ప్రతి బిడ్డకి పట్టించాలని అందులో రోగనిరోధక శక్తి అధికంగాఉంటుందన్నారు. తల్లి పాలల్లో ప్రోటీన్, కార్బోహైడ్రాట్లు క్రొవ్వు పదార్ధాలు, విటమిన్స్ ఏబిసి ఈ ఉంటాయని తెలిపారు. తల్లి పాలు తాగే పిల్లల్లో శారీరక, మానసిక వికాసం ఎక్కువగా ఉంటుందని, తెలివి తేటలు ఎక్కువగా ఉంటాయన్నారు. 6 నెలల వరకు పిల్లల పెరుగుదల, అభివృద్ధికి ఉత్తమమైన ఆహారం తల్లిపాలు అని చెప్పారు. అనంతరం బాలింత గృహాన్ని సందర్శించి ఆమె కి తల్లిపాలు ప్రతి 2 గంటలకి పట్టించాలి, శిశువుకి పాలు పట్టించే విధానం, తీసుకోవాల్సిన ఆహారం గురించి ఆమె భర్త కి, కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మోహిని, ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టకరం : సీడీపీఓ ఝూన్సీ రాణి

విశాలాంధ్ర - పాడేరు : పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లి పాలు పట్టించాలని, పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనదని అల్లూరి జిల్లా ఐసిడిఎస్ సిడిపిఓ ఝూన్సీ రాణి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సీడీపీఓ ఝూన్సీ రాణి వారి ఆధ్వర్యంలో పాడేరు ఐసిడిఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 నెలలు మోసి కన్న బిడ్డలను పెంచడంలో తల్లి పాత్ర ప్రముఖ మైనదని, తల్లిపాలలో అద్భుతమైన శక్తి ఉంటుందని, పుట్టిన బిడ్డకు వెంటనే స్తన్యం ఇవ్వడం చాలా అవసరమని తెలిపారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ఆగస్టు 1-7 తేదీ వరకు ప్రపంచ దేశాలలో తల్లిపాల వారోత్సవాలను జరుపుకుంటారని తెలిపారు. తల్లిపాలు బిడ్డలకు పోషకాలను అందిం చడమే కాకుండా పసి వయసులో వ్యాధుల బారిన పడకుండా కాపాడుతాయని సూచించారు. తల్లిపాలు పుట్టిన బిడ్డకు వెంటనే పట్టించాలని దీని ద్వారా ఆ బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగు తుందన్నారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించాలన్నారు. పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనదని, మొదటి ఆరు నెలలు తల్లిపాలు శ్రేష్టమన్నారు. డబ్బాపాలు వద్దు తల్లిపాలు ముద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్స్, ఊర్మిళ రెడ్డి, రాజేశ్వరి, కవిత, లక్ష్మి, అచీయమ్మ, రమణి, అలాగే అన్ని సెక్టర్ల అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి దినోత్సవం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - జీకే వీధి : ఆగస్టు 9వ తేదీన జరగనున్న ఆదివాసి దినోత్సవం విజయవంతం చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలో ఉపాధ్యాయ ,ఉద్యోగ సంఘం నాయకులు సమావేశం ఏర్పాటు చేసి చర్చించుకోవడం జరిగిందని ఉద్యోగ సంఘ నాయ కులు తెలిపారు ఈ కార్యక్రమంలో లోచల రామ కృష్ణ, పాతున రామరాజ్యం, ముక్కలి కామేశ్వరరావు, కుర్ర మల్లేశ్వరరావు, రెడ్డి వెంకటేశ్వర్లు, కంకిపాటి గణపతి రావు, నాడెల దొరబాబు, ముట్టడం వీరయ్య, బూడిద వీరబాబు, కిట్లాంగి పెద్దబ్బాయి సాగిన సత్యనారాయణ, కంకిపాటి కోటి వీరభద్రం పడాల్,తదితరులు పాల్గొన్నారు

తల్లిపాలే బిడ్డకు ఎంతో శ్రేష్ఠం : సీడీపీఓ లక్ష్మి

విశాలాంధ్ర - గంగవరం : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని తల్లిపాలలో, ఋర్రు పాలలో బిడ్డకు వ్యాధి నిరాక శక్తి ఎక్కువగా ఉంటుందని సిడిపిఓ లక్ష్మి అన్నారు. సోమవారం ఐసిడిఎస్ కార్యాలయంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమానికి అవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలుగా ఉన్నప్పుడే పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మధ్యవంతమైన శిశువుకు జన్మనివ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సీమంతం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అలాగే 100 రోజుల మిషన్ శక్తి, సంపూర్ణత అభియాన్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్స్ వి,జయలక్ష్మి, టి.సత్యవతి, బ్లాక్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ హేమా మాధురి, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

వ్యాధుల వ్యాప్తికి కారణమయ్యే డంపింగ్ యార్డ్, పశువద శాలలను మరో చోటకు మార్చండి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆశ్రమ వసతి గృహ విద్యార్థుల విన్నపం

విశాలాంధ్ర - చింతపల్లి : పశు వద, డంపింగ్ యార్డ్ ల వలన వచ్చే దుర్గంధం, వాటిని దహనం చేయడం వలన వచ్చే పొగతో తమకు శ్వాసకోస సంబంధ వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డిగ్రీ కళాశాలకు చెందిన బాలుర, బాలికల ఆశ్రమ వసతిగృహ విద్యార్థులు కళాశాల సమీపంలో ఉన్న పశువదశాల, డంపింగ్ యార్డ్ల వలన వచ్చే సమస్యలపై స్థానిక తహసిల్దార్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ లకు సోమవారం సమస్యల పరిష్కారానికై వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ కళాశాల చెంతనే ఇటువంటి వ్యాధులు వ్యాపింపజేసే డంపింగ్ యార్డ్, పశువదశాలలు ఉండడం దురదృష్టకరమన్నారు. వీటి వలన తాము అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. డంపింగ్ యార్డ్ దహనం చేసిన ప్రతిసారి అక్కడి నుండి వచ్చే పొగ, దుర్గంధం భరించలేకపోతున్నామని, వీటి వలన శ్వాస కోస, ఉదర సంబంధ వ్యాధులు ప్రభలే ప్రమాదం లేకపోలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కళాశాలకు సమీపంలో ఉన్న పశు వద శాలను, అదేవిధంగా డంపింగ్ యార్డ్ ను మరోచోటకు మార్చాలని, ఆ సమస్య నుండి కళాశాల, ఆశ్రమ వసతిగృహ విద్యార్థులకు విముక్తి కలిగించాలని వినతి పత్రాల ద్వారా అధికారులకు వివరించడం జరిగిందన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో కేరళ వయనాడ వరద బాధితులకు సహాయార్థం కోసం విరాళాలు వసూలు

విశాలాంధ్ర - అనంతగిరి : మండలం లో 7081 రూపాయలు విరాళాలు సేకరించిన సిపిఎం బృందం సోమవారం అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు మండల కార్యదర్శి సోమెల నాగులు టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు అనంతగిరి సంతలో విరివిగా విరాళాలు సేకరించారు విరాళాలు ఈ సందర్భంగా అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు మాట్లాడుతూ కేరళ వయనాడ్ వరధ బాధితులకు సహాయార్థం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు అనంతగిరి మండలం నుండి మొత్తం 7081 ఏడు వేల ఎనబై ఒక్క రూపాయిలు వసూలు అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరాజి సురేష్ బొండాం లక్ష్మణరావు కంసూరి చంటి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి

విశాలాంధ్ర - పార్వతీపురం : మన్యం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంను మన్యం జిల్లా అదనపు ఎస్పీ డా.ఓ.దిలీప్ కిరణ్ సోమవారం నిర్వహించారు.పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీఎస్.వి.మాధవ్ రెడ్డి ముఖ్యమంత్రి సదస్సుకు అమరావతి వెళ్లడంతో ఆయన ఉత్తర్వుల మేరకు అదనపు ఎస్పీ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించారు. 8 మంది ఫిర్యాదులు అందజేసినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఈ స్పందన కార్యక్రమంలో అదనపు ఎస్పీతో

పాటుడి.సి.ఆర్.బి, ఎస్ఐ. గోవిందరావు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 148 దరఖాస్తులు

విశాలాంధ్ర - పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిలా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, పార్వతీపురం ఆర్డీవో కె.హేమలతలు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి సమావేశానికి హాజరు కాగా, జాయింట్ కలెక్టర్ ఐటీడీఏ పీవోలు ముఖ్య మంత్రి వీడియో కాన్ఫరెన్సు పర్యవేక్షించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 148అర్జీలు ప్రజలు అందజేసారని చెప్పారు.సీతానగరం గ్రామానికి చెందిన నాగవరపు వీరభద్రుడు గత ఆదివారం పాముకాటుతో మరణించారని, అతనికి ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయం అందజేసి తనకుటుంబాన్ని ఆదుకోవాలని కుమారుడు నాగవరపు రాజారావు దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పలువురు కీలకమైన అధికారులు ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నందున గ్రీవెన్స్‌కు హాజరు కాలేదు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గల సమస్యలు పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఆర్టీసీ డిపిటిఓ డిఎంకు గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీ శంక ర్రావు సోమవారం వినతి పత్రం అందజేశారు. గుమ్మలక్ష్మీ పురం గ్రామ పంచాయతీలో గల ఆర్టీసీ కాంప్లెక్స్ కు నిత్యం వందలాదిమంది గిరిజనులు దూర ప్రాంతా లకు ఇక్కడ నుండే ప్రయాణిస్తున్నారు. అయినప్పటికీ కాంప్లెక్స్ లో కనీస మౌలిక సౌకర్యాలు లేక ప్రయా ణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షం పడితే రహదారి మొత్తం బురదమయం అవుతుంది. మరోవైపు రాళ్లు తేలిపోయి నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. ప్రయా ణికులు కూర్చున్న ప్రదేశంలో ఫ్యానులు లేవు. త్రాగునీటి పైపులు కూడా లీకులు అవుతున్నాయి. మరుగుదొడ్ల సదుపాయం అంతంత మాత్రమే, చుట్టూ ప్రక్కల పరిశుభ్రత లోపం. రాత్రి చివరి బస్సు వచ్చే సమయానికి బయట లైట్లు లేక, ఫ్యాన్లు లేక ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోనే అధిక రాబడి కలిగిన డిపో ఇది అయినప్పటికీ సౌకర్య విషయంలో గాలికి విడిచి పెట్టేస్తున్నారు. ఇది చాలా విచారకరము. ఇకనైనా ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా చర్యలు తీసుకోవాలని ప్రార్థిస్తూ, వినతి పత్రాన్ని అందజేశారు.

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవోలు

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లా కలెక్టర్ల సదస్సుకు జిల్లా కలెక్టర్ వెళ్లడంతో:జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఎస్. సేధు మాధవన్ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితుల సహాయార్థం ఏఐవైఎఫ్ నాయకులు నిధులు సేకరణ

విశాలాంధ్ర - సీతంపేట : కేరళ రాష్ట్రంలో అతి పెద్ద విపత్తుగా వరదలు వచ్చి వైనాడు జిల్లా తీవ్రంగా నష్టపోయి, ప్రాణాలను కోల్పోయిన తరుణంలో వరద బాధితులను ఆదుకునే దిశగా ఏఐవైఎఫ్ నాయకులు నిధులు సేకరణ సీతంపేట సంతలో సోమవారం చేశారు. సేకరించిన నిధులు ఆ రాష్ట్ర వరద బాధితుల సహాయ నిధికి పంపించడం జరుగుతుందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూరంగి గోపినాయుడు తెలిపారు. ఈ నిధులు సేకరణ కార్యక్రమంలో బిడ్డిక భాస్కర్‌రావు, గేదెల సంగమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న పార్వతీపురం, విజయనగరం జిల్లా కలెక్టర్లు

విశాలాంధ్ర - పార్వతీపురం : రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్ట మొదటిసారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు నిర్వహించిన జిల్లా కలెక్టర్ ల సమావేశంకు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్, విజయ నగరం జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌లు హాజరయ్యారు. రెండు జిల్లాలకు సంబంధించి పలు అంశాలను వారు సీఎంకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా శిశుసంక్షేమశాఖ మరియు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి కూడా పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఆదేశాలు అమలకు కృషి

విశాలాంధ్ర- సీతంపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి చ నిర్వహించిన సమీక్షా సమావేశానికి వర్చువల్ విధానంలో ఐటిడిఎ పీవో టి.రాహుల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సంధర్భంగా ముఖ్యమంత్రి ఇచ్చిన సూచనలు, ఆదేశాలను అమలు పరుస్తూ, ముఖ్యమంత్రి సూచించిన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని అన్నారు.

ఆరోగ్య కేంద్ర అదనపు భవనానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర

విశాలాంధ్ర - సీతానగరం : ఎన్డీఏ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు, త్రాగు నీరుకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర తెలిపారు.మండలంలోని పెదంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో అదనపు భవనానికి ఎమ్మెల్యే విజయ్ చంద్ర భూమి పూజ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభివృద్ధి సంక్షేమ పనులు చేయడం జరుగుతుందన్నారు. నియోజక వర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆసుపత్రి భవనానికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి 50 లక్షల రూపాయలు మంజూరు కాగాత్వరితగతిన పనులు పూర్తిచేసి భవన నిర్మాణాన్ని పూరి చేయాలని ఆదేశించారు. తమ గ్రామానికి మొదటిసారి విచ్చేసిన విజయ్ చంద్రను పంచాయతీ వార్డుసభ్యులు, గ్రామపెద్దలు, నాయకులు, కార్యకర్తలతో పాటు ఆసుపత్రి సిబ్బంది ఎంఎల్ఏ విజయ్ చంద్రనుఘనంగా సన్మా నించారు. గ్రామంలోని ఆసుపత్రి సచివాలయం పాఠశాల అంగన్వాడి కేంద్రం తదితర సంస్థలన్నింటిని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బలగ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధాకాంత్, ఆర్ అండ్ బి డి, ఏఈ రామ్మోహన్ నాయుడు, గ్రామస్తులు బలగ పార్వతి, జక్కు మహాలక్ష్మి, బలగ రవణమ్మ, బలగలక్ష్మి, సింహాచలం బలగ బలరాంనాయుడు రుత్తల తవిటి నాయుడు, గోర్జి శంకరరావు, బలగ చిన్నమనాయుడు, టిడిపి నాయకులు పెంట సత్యంనాయుడు,రౌతు వేణుగోపాల నాయుడు, సాల హరగోపాల్, దామినేని భాను ప్రసాద్, జొన్నాడతేరేజమ్మ, బుడితి శ్రీనివాసరావు, సబ్బాన శ్రీనివాసరావు, తెంటు వెంకట అప్పల నాయుడు, ఉడమల సూర్యనారాయణ, ఏగిరెడ్డి భాస్కరరావు, కొట్నాణ రామకృష్ణ నాయుడు, కంకణాలపల్లి అరవింద్ కుమార్,రెడ్డి సింహాచలం నాయుడు, సోమిరెడ్డి రమేష్, నాగభూషణ రావు, వంజరాపుగుంప స్వామినాయుడు, మూడడ్ల వెంకటనాయుడు, వాకాడ పారి నాయుడు, బలగ శ్రీనివాసరావు, గాజాపు తాతబాబు, బర్ల వెంకటరమణ, గొట్టాపు మంగమ్మ అప్పారావు, తెంటు రామారావు, మరడాన గౌరునాయుడు, తేలుచంద్రశేఖర్, పెంట సురేష్, తేలుతిరుపతి, బొన్నాడ సత్య నారాయణ, ఇజ్జాడ రాంబాబు, సబ్బాన జగన్నాథం, మ్రాపు శంకరరావు, కళ్యాణ బలరాం, నీరస జ్యోతి చంద్రశేఖర్, పూడి శ్రీరాములునాయుడు, పరిసినాయుడు,యాళ్ల రామినాయుడు, కంద్యాన రవీంద్రనాయుడు, బలగ ధనంజయనాయుడు, బూరాడ చిరంజీవి, బొమ్మి నాయిని లక్ష్మణరావు, బోను శ్రీనివాసరావు, చింతాడ సత్యనారాయణ, మీసాల వెంకటరమణ, ఎన్ సతీష్, సాయి, జక్కుపకీరునాయుడు,మ్రాపు సత్యనారాయణ, తాన్న సత్యనారాయణ బొంగు సురేష్,మ్రాపు యోగేశ్వరరావు, భోగిల గుప్తాధిత్య పట్నాయక్, తాన్న గుంపస్వామి, కర్రి శంకరరావు తదితరులు పాల్గొన్నారు. వారితోపాటు జనసేన బిజెపి నాయకులు కూడా పాల్గొన్నారు.

రైతన్నలను ఆదుకోవాలి : ఎంపీపీ, జడ్పీటీసీలు

విశాలాంధ్ర - బలిజిపేట : రాష్ట్రంలోని రైతులను ఆదుకోవాలని బలిజి పేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు గుడివాడ నాగమణి, జడ్పిటిసి అలజింగి రవికుమార్లు తెలిపారు. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో రైతు భరోసా అనే పథకాన్ని వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టారని, రైతుకు కావలసిన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా పథకము ద్వారా ప్రతి సంవత్సరము 15 వేల రూపాయలు మే నెలలో పెట్టుబడి సాయం అందజేశారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చి రైతు భరోసా బదులుగా అన్నదాత సుఖీభవ పథకమును పేరు మార్చి పెట్టుబడి సాయం కింద 20000 అందజేస్తామని రైతుకు హామీ ఇచ్చారు ఆగస్టు నెల వచ్చినప్పటికీ రైతుకు పెట్టుబడి సాయం అందలేదని చెప్పారు ర ప్రభుత్వం ఏర్పడి 50 నెలలు గడచిన్నప్పటికి ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు.

మండల న్యాయ సహాయ సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - కురుపాం : కురుపాం మండల న్యాయ సహాయ సంస్థ చైర్మన్, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సౌమ్య జోస్ఫిన్ ఆధ్వర్యంలో శివన్న పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తో పాటు పరిశర గ్రామాల్లో ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందారు. న్యాయవాదులు బరాటం చంద్ర మౌళి, కేతిరెడ్డి చంద్ర శేఖర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జి.వెంకట రావు, వైద్యులు డాక్టర్ శోభా రాణి, మాదలింగి, రావాడ రామభద్రపురం వైద్యులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు నిబంధనలు ప్రకారం నిర్వహించాలి

విశాలాంధ్ర - బలిజిపేట : స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించాలని బలిజిపేట మండల విద్యా శాఖాధికారి 1 సామల సింహాచలం అన్నారు. సోమవారం ఆయన మండలంలోని బలిజిపేట, పెద పెంకి 2 ఎంపీపీ పాఠశాలలను సందర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.

శివనామస్మరణతో సందడి చేసిన ఒడిశా శివభక్తులు

విశాలాంధ్ర - సీలేరు : జీకేవీధి మండలం సీలేరులో సోమవారం ఒడిశాకు చెందిన బోలాబామ్ మాలలను ధరించిన శివభక్తులు శివనామస్మరణతో సందడి చేశారు. ఒడిశా, చిత్రకొండ బ్యాల్ పరిధిలో 11వ నెంబరు విలేజ్ 12వ నెంబరు విలేజ్‌లకు చెందిన సుమారు 60 మంది బోల్‌బామ్ మాలను ధరించిన శివ భక్తులు వారి గ్రామం నుంచి సీలేరుకు కాలినడకన భజనలు చేసుకుంటూ స్థానిక శివాలయంకు చేరుకున్నారు. అనంతరం ఆ భక్తులంతా వారి గ్రామం నుంచి ప్రవహించే వాగు నుంచి కావిళ్లతో తీసుకొచ్చిన నీటితో శివలింగానికి అభిషేకం చేశారు. అనంతరం ఆలయ పూజారి వీరిని ప్రత్యేక పూజను నిర్వహించారు.

మంచినీరు దొరకక అవస్థలు

పట్టించుకోని గ్రామ సర్పంచ్, అధికారులు

విశాలాంధ్ర - జీకే వీధి : గూడెం కొత్త వీధి మండలం దేవరపల్లి పంచాయతీ రామగడ్డ రోడ్డు వీధి గ్రామంలో సోలార్ వాటర్ పంపు గత సంవత్సరం నుండి మరమ్మతుల గురైందనీ, దీంతో మంచినీరు దొరక్క తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్త పరిచారు. మంచినీటి కోసం కాలువ ఊటగడ్డ నీరు తెచ్చుకోనీ త్రాగడం జరుగుతుందని, భారీ వర్షాలుకు ఊట భావి కూడాను మట్టితో కూరుకు పోవడం జరుగు తుందన్నారు. రామగడ్డ రోడ్డు వీధి గ్రామ స్తులు 15 కుటుంబాల ప్రజలు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని అన్నారు. దేవర పల్లి సర్పంచ్, అధికారులకు పలుమార్లు తెలియజేసినప్పటికీ ఫలితం లేదని, సంవత్సరం అయినా ప్రజా ప్రతినిధులు అధికారులు కనీస స్పందన, చలనం లేదనీ వాపోయారు. ఇప్పటికైనా మా గ్రామానికి సోలార్ విద్యుత్ పంపు సెట్ ను మరమ్మత్తయిన చెయ్యండి, ఊట బావికి ట్యాంకునైన నిర్మించండి అంటూ రామగడ్డ రోడ్డు వీధి గ్రామస్తులు గెమెల భాస్కరరావు, మర్రి రవికుమార్, తాంబేల నాగేశ్వరరావు, మర్రి ప్రసాద్, చిన్నమ్మి, అనురాధ, సంగీత కోరారు.

పేద ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తా : గాంధీ బాబు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : పేద ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఏఎస్డిఎస్ సంస్థ డైరెక్టర్ వి గాంధీ బాబు అన్నారు. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా ఉండడమే లక్ష్యంగా ఏ.ఎస్.డి.ఎస్ సంస్థ ఎన్నో దశాబ్దాల కాలంగా పేద ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తుందని మండల జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, అధికారులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని దర్మాతల గూడెం గ్రామంలో వరద బాధితులకు ఎస్.ఎస్.డి.ఎస్ సంస్థ ఆధ్వర్యంలో గూంజు వారి సహకారంతో సుమారు 1500 రూపాయలు విలువ చేసేటటువంటి టార్పాలిన్, బెడ్ షీట్, తవల్స్, రోప్స్, మేట్స్ తదితర కిట్స్ ని సుమారు 172 కుటుంబాలకి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ బాబు మాట్లాడుతూ గోదావరి వరదలను ప్రజలు అనేక ఇబ్బందులకు పడ్డారని ప్రతి సంవత్సరం వరద బాధితులకు సంస్థ తరఫున సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తూనే ఉన్నామని తెలిపారు. ఎస్ డి ఎస్ సంస్థ ప్రజలకు ఎప్పుడు సేవ చేసేందుకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థానిక ఎమ్మార్వో సయ్యద్ పజిల్, ఎంపీడీవో ఫణీంద్ర, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, స్థానిక సర్పంచ్ సోడి నర్సమ్మ, గూంజు కోఆర్డినేటర్ తిరుపతిరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత కార్యక్రమం

విశాలాంధ్ర - చింతూరు : గిరిజన సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశానుసారం చింతూరు డివిజన్లో కళాజాత కార్యక్రమాలు నిర్వహిస్తామని ఐటిడిఏ పిఓ కావూరి చైతన్య ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ వర్షాలు, వరదలు వలన మన ప్రాంతంలో కీటక జనత వ్యాధులు, కలుషిత నీరు,ఆహారం ద్వారా సంభవించు టైఫాయిడ్, కామెర్లు మరియు అనిమియా, సికిల్ సెల్ అనిమియా తదితర వ్యాధులు, ఇతర మూఢ నమ్మకాలు గురించి కళాజాత కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలియచేసారు. ఈ సందర్భంగా డివిజన్లో మొత్తం 25 ప్రదేశాలలో రోజుకి 4 ప్రోగ్రామ్స్ చొప్పున ఈ కళాజాత కార్యక్రమాలు నిర్వహిస్తారని,సోంపటి నుంచి 12వ తేదీ వరకు సూచించిన షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని తెలియజేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని సంబంధిత వైద్యాధికారులు, పంచాయతీరాజ్, విద్యా, వెలుగు, త్రాగు నీటి సరఫరా, అంగన్వాడీ శాఖల వారు క్షేత్ర స్థాయిలోని సిబ్బందికీ షెడ్యూల్ వివరాలు తెలియచేసి, వారి ద్వారా ప్రజలను కళాజాత కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని తెలియజేశారు.

అదృశ్య యువకుడు మృతి

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : అదృశ్యమైన యువకుడు జాంగుడ సమీపంలోని పొలం గడ్డ వాగులో మృతి చెందినట్లు గుర్తించడం జరిగిందని స్థానిక సీఐ రుద్రశేఖర్ తెలిపారు. సోమవారం అయిన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత నెల 30న కంచరపాలెంకు చెందిన బంగారి. కోటేశ్వర రావు, ఈశ్వరి దంపతులకు చెందిన చంద్రకాంత్ (17) అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కోణంలో దర్యాప్తు చేస్తుండగా మండలంలోని కోర్రాయి పంచాయతీ జాంగుడ పొలం గడ్డ వాగులో యువకుడు మృతి చెందినట్లు సోమవారం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీంతో పోలీసులు సంఘటన ప్రదేశంలో చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా హాస్పిటల్ కు తరలించారు. యువకుడు మృతికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపడతామని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థను సద్వినియోగం చేసుకోండి

విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ

విశాలాంధ్ర - చింతపల్లి : ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పని చేస్తే ప్రజలకు చట్టాలు, హక్కులపై అవ గాహన ఏర్పడుతుందని విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం వెంకట శేషమ్మ అన్నారు. స్థానిక ప్రధమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ న్యాయవాది మధుసూదన్ ఆధ్వర్యంలో మండలంలోని కొమ్మంగి పంచాయతీ రౌరింతాడ గ్రామంలో ఏర్పాటుచేసిన న్యాయ సేవాధికార సంస్థ మరియు వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె అన్ని శాఖలను ఉద్దేశించి చట్టాలు, హక్కులపై ప్రసంగించారు. రాష్ట్ర, జిల్లా లీడర్స్ అథారిటీ, మండల లీడర్స్ కమిటీ తరఫున షెడ్యూల్ తెగలకు సంబంధించి చట్టాలపై అవగాహన కల్పించడమే గాక, అదే క్రమంలో వైద్య శిబిరం నిర్వహించడం సంతోషకరమన్నారు. చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకొని ప్రభుత్వాలు అందిస్తున్న ఇతర సర్వీసులు ఇతర పథకాలు ప్రజలకు అందే విధంగా, వాటి ఫలాలు ప్రజలకు చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో వీర సాయిబాబు, ఏ టి డబ్ల్యూ ఓ జయనాగలక్ష్మి, చింతపల్లి ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ చంద్రశేఖర రావు, సీఐ రమేష్, ఎస్సై లు అరుణ్ కిరణ్, వెంకటరమణ, ఎంఈఓ పనసల ప్రసాద్, ఐసిడిఎస్ సిడిపిఓ రమణి, ఏసీడీపీఓ రామలక్ష్మి, సూపర్వైజర్ విజయ కుమారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎం కృష్ణమూర్తి, స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు, ప్రధమ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు సిబ్బంది, వివిధ శాఖల అధికారులు రౌరింతాడ గ్రామస్తులు పాల్గొన్నారు.

కోర్రాయి వంతెన వెంటనే నిర్మించాలి

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన కొర్రాయి పంచాయతీ జాముగుడ బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్ బి పోతురాజు, మండల నాయకుడు పి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న జాముగూడ వంతెనను సీపీఎం నాయకులు సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కొర్రాయి జాము గుడ బ్రిడ్జి నిర్మాణం జరగలేదని, ఈ వంతెనకు ఆనుకుని కొర్రాయి, కొల్లపుట్ పంచాయితీల ప్రజలు సుమారు 22గ్రామాలు ఉన్నాయన్నారు. ఇదే మార్గంలో ఆంధ్రా, ఒరిస్సా ప్రజలు కూడా ప్రయాణం చేస్తుంటారని చెప్పారు.ఎంతో రద్దీగా ఉండే మార్గంలో కొర్రాయి వంతెన ప్రజలకు శాపంగా మారిందని, ఎన్నో ఏళ్ళుగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు ఆందోళన చేస్తున్న ప్రభుత్వ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని మండిపడ్డారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల దగ్గర మొర పెట్టుకున్న పలితం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం నిర్వహించే స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రోజెక్టు అధికారిని కూడా పిర్యాదు చేసిన బ్రిడ్జి నిర్మాణం జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు వంతెన నిర్మాణం కోసం చొరవ చూపాలని కోరారు. లేదంటే ప్రజలను కూడ గట్టుకొని ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పి.సత్య నారాయణ, పి.మోహన్‌దాస్, జగన్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర

విశాలాంధ్ర - సీతానగరం : ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని పార్వతీ పురం ఎమ్మెల్యే విజయ్ చంద్రపిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్ పుస్త కాలు, పాఠ్య పుస్తకాలను,బ్యాగులను అందజేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుంటే మంచి ఉద్యోగం సంపా దించి వారి కుటుంబం మొత్తం ఆర్థికంగా నిలదుక్కునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారని, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ చొరవతో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, బ్యాగులు అందించేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మంజుల వీణ, ప్రిన్సిపాల్ దాలి నాయుడు, తహసిల్దార్ రాములమ్మ, ఎంఈఓలు సూరి దేముడు వెంకటరమణ, అధ్యాపకులు, టిడిపినాయకులు సాలహరి, పెంటసత్యం నాయుడు, దామినేని భాను ప్రసాద్, వేణుగోపాల నాయుడు, తేరేజమ్మ గరికయ్య, అరవింద్, బుడిత శ్రీనివాసరావు, సబ్బాన శ్రీనివాసరావు, ఇజ్జాడ రాంబాబు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - పార్వతీపురం : మన్యం జిల్లా ఎస్పీఎస్.వి.మాధవ్ రెడ్డి సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సియెచ్.ద్వారకా తిరుమల రావుని మంగళగిరిలోని డిజిపి ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. బిజెపి జిల్లాల ఎస్పీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొ న్నారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల సమస్య లపైన, గంజాయిపై తీసుకున్న చర్యలు, 100రోజుల కార్యాచరణ తదితర అంశాలమీద చర్చించారు.

వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న పొలిటికల్ గేమ్ చేంజర్ వీరేష్ దేవ్

విశాలాంధ్ర - కురుపాం : రాజకీయాల్లోకి ప్రవేశించిన అనతికాలంలోనే తనదైన పని తీరు ప్రదర్శించి ముప్పై ఏళ్ల తర్వాత కురుపాం నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే గా తోయక జగదీశ్వరి గెలుపు కు కారణమైన కురుపాం పొలిటికల్ గేమ్ చేంజర్, రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వైరిచర్ల వారసత్వం, పూసపాటి బంధుత్వం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నా గొప్ప పరిచయాలు ఉన్నప్పటికీ ఎలాంటి గొప్పతనం లేకుండా వీరేష్ చంద్ర దేవ్ అందరితోనూ సాదారణ వ్యక్తి లా కలిసి పోయి స్నేహపూర్వకంగాప్రజల్తో మమేకమై పోయారు. ఎన్నికలు అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పదవుల కోసం అమరావతి విడిచి పెట్టకుండా ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటే తాను మాత్రం పార్టీ కి తనపై నమ్మకం ఉండటం తో ఎన్నికలు భాధ్యత అప్పగించింది సమర్థవంతంగా పని చేసి విజయం సాధించాం. తనకు పార్టీ పై నమ్మకం ఉంది భవిష్యత్తు అధినేత చేతుల్లో ఉందంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో జరిగే ప్రతి అంశం పార్టీ అధిష్టానానికి తెలిసిందేనని అందరికీ సముచిత గౌరవం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.కురుపాం నియోజకవర్గంలో సుదీర్ఘ కాలం రాజకీయాలు చేసిన కురువృద్ధులు, అపరచాణిక్యులు ఉన్నప్పటికీ వీరేష్ దేవ్ పనితీరును ముందే గుర్తించిన తెలుగు దేశం పార్టీ అధిష్టానం కురుపాం నియోజకవర్గ ఎన్నికలు నిర్వహించే కీలక బాధ్యతలు అప్పగించింది. అప్పటి వరకు ఉప్పు నిప్పులా ఉన్న రెండు వర్గాలను ఏకం చేసి సమన్వయం తో పనిచేసేలా చేయటం మొదలుకునీ, తటస్థంగా ఉన్నా తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలలో ఉత్సాహం నింపుతూ అందరికీ నేనున్నా అంటూ భరోసా కల్పిస్తూ నియోజకవర్గంలో ఐదు మండలాల్లో గ్రామాల్లో కాలికి చక్రాలు కట్టుకుని ముమ్మర ప్రచారం చేపట్టారు. కురుపాం లో అన్ని కులాల వారితో రోజు వారి ఆత్మీయ సమ్మేళనాలు అందరి మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించు కున్నారు. తన రాజకీయ ప్రవేశం అడ్డుకునేందుకు కొందరు బహిరంగంగా చేసిన విమర్శలను సైతం సవాల్ తీసుకుని వారిని సైతం కలుపుకుని, పక్కనే కూర్చోపెట్టి సమాలోచనలు చేసేందుకు చేసిన ఆహ్వానం అత్యధిక శాతం ప్రజల్ని ఆకట్టుకుంది. ఎన్నికలు విజయం సాధించిన అనంతరం కురుపాంలో నిర్వహించిన విజయోత్సవ సభలో సైతం అందరూ సమన్వయం తో పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ద్వారా జరిపించాలని చేసిన సూచన వీరేష్ ఔన్నత్యాన్ని తెలిసేలా చేసింది. ఇటీవల ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అధ్యక్షతన శత్రుచర్ల విజయరామరాజు నివాసంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో సైతం ఆదిపత్యం కోసం ఎన్నికలు అనంతరం కొందరు పడుతున్నా అత్యుత్సాహం పైన, విమర్శలు పైన స్పందించిన ఆయన ఎందరో ఆశావహులు త్యాగం, కష్టం, క్రృషి ఫలితంగా పొందిన విజయం అసాధారణమైనదని, కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమం, అభివృద్ధి లో అందరినీ భాగస్వామ్యం చేయాలని లేదంటే ఏస్థాయిలో వారికైనా పరాభవం తప్పదంటూ మేల్కొలిపారు. కురుపాంలో 2024 ఎన్నికల నిర్వహణళ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు వీరేష్ దేవ్ పని తీరు ప్రశంసించాయి. తెలుగు దేశం పార్టీ అధిష్టానం తనపై నమ్మకం తో ఇచ్చిన భాధ్యతలు శాతం పూర్తి చేసి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విజయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు అప్పగించడం తో తన కర్తవ్యాన్ని పూర్తి చేసానని ఆయన నిగర్వంగా తెలుపుతూ ఇంకా పై ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తో నియోజకవర్గ అభివృద్ధి పరుగులు పెట్టించేలా ముందుకు నడిపించే భాధ్యత అందరికీ అప్పగించారు.

చట్టాలపై ప్రజలు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - సీతంపేట : కడగండి పంచాయతీ ఓంద్రు జోల గ్రామంలో లీగల్ కేసులు, చట్టాలపై ప్రజలకు అవగాహన సదస్సు సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.సన్యాసి నాయుడు శ్రీకాకుళం వారు మరియు జూనియర్ సివిల్ జడ్జి విజయరాజ్ కుమార్ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా కుషి మి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మెడికల్ క్యాంపు నిర్వహించారు, ప్రజలు తాగుడుకు, ధూమపానానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ఓంద్రు జోల గ్రామంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు విద్యా ర్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని, ప్రభుత్వం మంజూరు చేసిన క్వాలిటీ భోజనం విద్యార్థులు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర, ఏఎస్ఐ సంజీవరావు, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తహీనతతో బాధపడే వారు బలమైన ఆహారం తీసుకోవాలి

విశాలాంధ్ర - హుకుంపేట : రక్తహీనతో బాధపడే వారు తప్పకుండా రక్త పరీక్షలు, బాలమైన ఆహారం తీసుకోవాలని స్థానిక వైద్యధికారి మోహన్ పేర్కొన్నారు. మండలంలో రంగశీల,సూకూరు పంచాయతీ కేంద్రాల్లో రక్తహీనతపై వీఎస్ఆర్ వీ డియా రాజమండ్రి కళాజాతర బృంద సభ్యుడు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో అదేశా లతో కళాజాతర ర్వహించి రక్తహీన త,టీబి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వైద్యధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత కలిగిన వారు ఆకుకూరలు అధికంగా తీసుకుంటూ ఆసుప త్రిల్లో ఇచ్చే మందులు. తప్పకుండా వదాలని ఆయన 'కోరారు. అధికంగా దగ్గు, జర్వం ఉన్న వెంటనే టీబీ పరీక్షలు ఆసుప్రతుల్లో చేయించు కోవాలని ఆయన కోరారు. ఈకార్యక్ర మంలో వైద్యాధికారిని శాంతి, సుకూరు సర్పంచ్ ధనసాని సత్యవతి, రంగస్థలం సర్పంచ్ తాంగుల ముత్యాలమ్మ, టీబి సూపర్వైజర్ సదానందం, హెచ్.పీ జానకమ్మ, ఎం.ఎల్.హెచ్.పి అరుంధతి, ఏఎన్ఎం పూర్ణ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం తహశీల్దారుగా రాములమ్మ

విశాలాంధ్ర - సీతానగరం : మండల తహసిల్దారుగా జె .రాములమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు డిప్యూటీ తహశీల్దార్ ఉమామహేశ్వరరావు కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది వీఆర్వోలు కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆమె పార్వతీపురం ఎమ్మెల్యే విజయ్ చంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు నిరంతరం కృషిచేసి పని చేస్తానని తెలిపారు.

మొదటి నెల జీతంతో ఇన్వర్టర్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే శిరీషాదేవి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరిశాదేవి మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు. మొదటి నెల జీతం అందుకున్న ఎవరైనా తల్లి తండ్రులకు, కుటుంబ సభ్యులకు బహుమతులను అందజేస్తారు. కానీ ఎమ్మెల్యే అందుకు భిన్నంగా ప్రభుత్య హాస్పిటల్స్ కి ఇన్వర్టర్స్ అందజేశారు. మండలలో రాజవొమ్మంగి పిహెచ్సికి 3, జడ్డంగి పిహెచ్సికి 2, లాగరాయి పిహెచ్సికి 2 ఇన్వర్టర్స్ చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో నేను అంగన్ వడి టీచర్ గా ఉన్నప్పుడు లాగరాయి పిహెచ్సిలో ఒక గర్భిణీ బాత్ రూమ్‌కి వెళ్లి నప్పుడు అదే సమయంలో ఆవిడకి నెప్పులు ప్రారంభం అవడం, కరెంటు లేక పోవడంతో బయటకు వచ్చే సమయంలో అక్కడే డెలివరీ అవడం నాకు ఇప్పటికి గుర్తుందని తెలిపారు,పంపిణీ అనంతరం లబ్బర్తి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలలో పాల్గొని తల్లులకు పలు సూచనలు చేశారు,అక్కడే గర్భిణీ స్త్రీలకి సీమంత నిర్వహించారు, ఈ ఆమె వెంట తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం భాస్కర్, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్పిటిసి వడుగుల జ్యోతి, పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు,బోదిరెడ్డి త్రిమూర్తులు, తాము సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల బురదనీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్

విశాలాంధ్ర - కూనవరం : సుమారు 20 ఏళ్ల పాటు కూనవరం టేకులబోరు గ్రామాల్లో వర్షాకాలం వచ్చిందంటే చాలు గోదావరిలో పారే రా వాటరే జల్లెడ పెట్టి వడపోసుకొని తాగాల్సిన దుస్థితి ఉండేది. ఎర్రని బురద నీరే నల్లాల్లో వచ్చేది. వరదల సమయంలో అది కూడా వచ్చేది కాదు. అప్పటి ప్రభుత్వం తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి వాటర్ ట్యాంకులు కట్టి, ఫిల్టర్ బెడ్లు పెట్టి చివరికి అవన్నీ విఫలం చెందడంతో ఈ 20 ఏళ్ళు బురద నీళ్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎంతో మంది అధికారులు, సర్పంచులు, ప్రభుత్వాలు, ఎమ్మెల్యేలు, ఎందరు మారినా, ఎన్నిసార్లు మీడియాలో ఈ దుస్థితిపై వార్తా కథనాలు వచ్చినా సమస్య మాత్రం పరిష్కరించబడలేదు. కానీ ఈ సమస్యను చాలా సీరియస్ గా తీసుకున్న కూనవరం యువ సర్పంచ్ మల్లంపల్లి హేమంత్ గాంధీ మాత్రం పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్ సహకారంతో అటు ఆర్డబ్ల్యూఎస్ శాఖ ఉన్నతాధికారులను ఒప్పించి గోదావరిలో ఉన్నటువంటి బావిలో కొత్తగా సబ్మెర్సిబుల్ మోటార్లను తెప్పించి వరదలతో బురదలతో సంబంధం లేకుండా స్వచ్ఛమైన తాగనీరు సరఫరా చేసిందాకా పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించి సాధించాడు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు ఎప్పటిలాగే బురద నీళ్లకు అలవాటు పడిపోయిన ప్రజలు మొన్న గోదావరి వరదల సమయంలో కూడా అంతరాయం లేకుండా స్వచ్ఛమైన త్రాగునీరు సరఫరా అవడం చూసి అవ్వాక్కయ్యారు. విషయం ఏమిటని ఆరాతీయగా దీని వెనుక సర్పంచ్ హేమంత్, సెక్రటరీ సురేష్ ల కృషి ఉందని తెలిసి ప్రతి ఒక్కరు అభినందిస్తున్నారు. పథకాలు ప్రభుత్వాలు ఎన్ని మారినా, పనిచేయాలనే చిత్తశుద్ధి ఉంటే దాని ప్రతిఫలం ఇలాగే ఉంటుందని గ్రామస్తులు సర్పంచ్‌ని, సెక్రటరీని మెచ్చుకుంటున్నారు.

తహశీల్దార్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : ఇటీవల సంభవించిన శబరి గోదావరి వరదలు, గతంలో జరిగిన ఎలక్షన్లు, సమర్థ వంతంగా నిర్వహించిన విఆర్ పురం తాసిల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో మండల వివేకానంద ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఇక్కడికి వచ్చిన తక్కువ కాలం లోనే విధులు, ఉద్యోగం పట్ల వారికున్న నిబద్ధత, అధికారులని, నాయకులను సమన్వయం చేసు కుంటూ వరద బాదిత గ్రామాల్లో ప్రజలు పట్ల ప్రభుత్వం ద్వార రావలసిన సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. ప్రభుత్వం నుంచి వచ్చే అనేక పథకాలను సద్వినియోగం చేసేవిధంగా అవగాహన పరిచి ప్రతి ఒక్కరు లబ్ది పొందేలా ఆయన ఎంతో కృషిచేసారని అన్నారు. ఇలాంటి నాయకులు ఈ మండలానికి రావడం ఆనందంగా వుందని వారన్నారు. ఈ కార్యక్రమం లో ప్రెస్ క్లబ్ సభ్యులు దాస్నన రామారావు, మాస్కపల్లి సత్తిబాబు,ఎక్కేలా నాగేంద్రబాబు, గోలి వికాస్, బావి నాగేశ్వర రావు, కప్పల కృపారావు, గూటల వెంకటేష్, కోట్ల నరేష్, వల్లి సుందరం, బుయ్యన సురేష్, లక్ష్మణ్, ఎడ్ల విజయరాజు, బండి మహేష్, సతిష్ తదితరులు పాల్గొన్నారు

వరదల్లో ఇబ్బందులు పడిన ఉద్యోగస్తులకు మూడు వేలు చెల్లించాలని వినతి

విశాలాంధ్ర. వి.ఆర్.పురం : ఇటీవల సంబ వించిన గోదావరి, శబరి వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగస్తులకు మూడువేల రూపాయలు తక్షణమే ఇవ్వాలని, సోమవారం మండల తహసీల్దార్‌కు సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం అందజేశారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ వరదల్లో ఇల్లు మొత్తం నీట మునిగి అనేక అవస్థలు ఎదుర్కొన్న ప్రజానికానికి ప్రభుత్వం మూడువేల ఆర్థిక సహాయాన్ని చేసిందని, అదే విధంగా ఉద్యోగస్తులు ఇల్లు కూడా నీట మునిగాయని వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారికి కూడా తక్షణమే వరదల్లో ఇచ్చిన ఆర్థిక సహాయం మూడువేల రూపాయలు ఇవ్వాలని సిపిఎం మండల కమిటీ మండల తాసిల్దార్ ను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా నాయకులు పూనెం.సత్యనారాయణ, మండల ఎంపీపీ కారం లక్ష్మి నాయకులు పంకు.సత్తిబాబు, పులి.సంతోష్ కుమార్, కారం.సుందరయ్య, కమ్మచిచ్చు సత్తిబాబు సోడి.మల్లయ్య, నాళ్లారపు చంద్రావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు ముద్దు... డబ్బా పాలు వద్దు : హెల్త్ విజిటర్ కృష్ణవేణి

విశాలాంధ్ర - చింతపల్లి : వ్యాధి నిరోధక శక్తినిచ్చే తల్లి పాలు ముద్దని, డబ్బా పాలు వద్దని హెల్త్ విజిటర్ కృష్ణవేణి అన్నారు. అన్నవరం అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో వైద్య శాఖ తరపున పాల్గొన్న ఆమె గర్భిణీలు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువులకు తల్లిపాలు శ్రేష్టమని, వ్యాధి నిరోధక శక్తిని కలిగించే తల్లి ముర్రుపాలు శిశువులకు తాగించాలని, అదే క్రమంలో ఆరు నెలల పాటు శిశువులకు తల్లిపాలే ఆహారంగా అందించాలన్నారు. గర్భస్థ సమయం నుంచి శిశువు సంరక్షణపై వైద్య శాఖతో పాటు, ఐసిడిఎస్ శాఖ అంగన్వాడీల ద్వారా గర్భిణీలకు ఎంతో శ్రద్ధతో పోషకాహారం అందిస్తూ ఎప్పటికప్పుడు వారి బరువును, ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నారన్నారు. అటు వంటి ఎన్నో కార్యక్రమాలతో గర్భిణీలు బాలింతలనే గాక శిశువులను కూడా సంరక్షించే బాధ్యత తీసుకున్న వైద్య, ఐసిడిఎస్ శాఖల సేవలను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకొని పుట్టిన శిశువులకు తల్లి ముర్రు పాలు తప్పక తాగించాలని ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు ఆమె సూచించారు.

కేజీబీవీ పాఠశాలలో మొక్కలు నాటిన ఎంపీడీవో

విశాలాంధ్ర - మారేడుమిల్లి : స్థానిక కసూ_్తరిబా గాంధీ బాలికల పాఠశాల మరియు కళాశాల నందు స్థానిక ఎంపీడీవో ఏ వీర కిశోర్ మరియు ఏపీవో రెడ్డి బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఏ వీర కిషోర్ మాట్లాడుతూ పర్యా వరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరి పైన ఉందని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం అన్నారు. విద్యార్థులు తమ ఇంట్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం అందించిన కొబ్బరి, సపోట, నిమ్మ, నేరేడు వంటి పలురకల మొక్కలను మండలంలో ప్రతి ఒక్కరూ పాఠశాల మరి కళాశాలలో నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ మయూరి లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.